సాక్షి
నారాయణపేట
ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



వ్యాపారాలకు 'ఎన్నికల' దెబ్బ
అసెంబ్లీఎన్నికలు, కార్తీకమాసం ఒకేసారి రావడంతో వ్యాపారాలపై ప్రభావం చూపింది.
వివరాలు 8లో ▸



రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటాలి
రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభచాటాలని డీవైఎస్‌ఓ అన్నారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.3 /20.1
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఉత్తమ బోధన అందించాలి

ధన్వాడ: విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. శనివారం ధన్వాడ మండలంలోని మందిపల్లి తండా వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు హాజరు రిజస్టర్లను అనిఖీ చేశారు. విద్యార్థుల బోధనా సామర్థ్యాలను పరీక్షించారు. వంటగది, ఆవరణ మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని, ఉపాధ్యాయులు విధుల పట్ల అలసత్వం ప్రదర్శించరాదని అన్నారు.

మున్సిపల్ కార్యాలయం తనిఖీ



మక్తల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ శనివారం తనిఖీ చేశారు. మున్సిపల్ పరిదిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పారిశుద్ధ్య పనులు విధిగా చేపట్టాలని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చొరవ చూపాలని, అధికారులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. కమిషనర్ బాల్‌రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు

ధన్వాడ: ఉమ్మడి జిల్లా సీనియర్స్ బాల, బాలికల రెజ్లింగ్ జట్టుకు ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు రెజ్లింగ్ కోచ్ శ్రీనివాస్ తెలిపారు. సెలెక్షన్‌లకు వచ్చే క్రీడాకారులు వయస్సు 18 ఏళ్లు పైబడి ఉండాలని, తమ వెంట ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకురావాలని తెలిపారు.

వడ్లు క్వింటా రూ.3,423

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వడ్లు (సోనా) క్వింటాకు గరిష్టం రూ.3,423, కనిష్టంగా రూ.1,876 ధరలు పలికాయి. అలాగే, హంస క్వింటాకు గరిష్టంగా రూ. 2,019, కనిష్టంగా రూ.1,519, కందులు ఎర్రవి క్వింటాకు గరిష్టంగా రూ. 11,209, కనిష్టంగా రూ.3,729, కందులు తెల్లవి క్వింటాకు గరిష్టంగా రూ. 11,255, కనిష్టంగా రూ.9,022 ధరలు పలికాయి.

కురుమూర్తిస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు జడ్జి పాపిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

రాజకీయాలకు శాశ్వతంగా దూరం: వర్కటం

మక్తల్: ప్రజలే తనను వద్దనుకున్నారని, ఇక రాజకీయాలకు శాశ్వతంగా దూరమై సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తానని వీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.కోట్లు ఖర్చుచేసి ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, తాగునీరు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని, నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలిచానని గుర్తు చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నాని, తన సేవలను ప్రజలు ఏమాత్రం పట్టించుకోలేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన తనను తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు.


మన్యకొండలో ధనుర్మాస పూజలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజు తెల్లవారుజామున 4 గంటలకు ముందే స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ చైర్మన్ కోరారు.

నామినేటెడ్‌పై ఆశలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదవులపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ నేతలు

- ఇటీవల కార్పొరేషన్ చైర్మన్ల రద్దుతో పెరిగిన ఆశావహుల ప్రయత్నాలు
- ఎమ్మెల్యేగా గెలవడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కసిరెడ్డి
- టికెట్ త్యాగానికి ప్రతిగా ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్న పలువురు నేతలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో మళ్లీ నామినేటెడ్ పదవుల జాతర కొనసాగనుంది. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా పలువురు కాంగ్రెస్ ముఖ్యనేతలు ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ పదవులపై ఆశలు పెట్టుకున్నాయి. ఇటీవల రాష్ట్రంలోని 54 కార్పొరేషన్ చైర్మన్ల పదవులను ప్రభుత్వం రద్దు చేయడంతో నామినేటెడ్ పదవులను పొందేందుకు ఆశావహ నేతలు విస్తృతంగా ప్రయత్నాలను మొదలుపెట్టారు. ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున టికెట్ దక్కని నేతలు, ఇతరుల కోసం ఎమ్మెల్యే టికెట్‌ను త్యాగం చేసిన ముఖ్యనేతలు ఆశావహుల్లో ముందు వరుసలో ఉన్నారు.

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులపై ఆశలు..

గత ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నేతలకు కార్పొరేషన్ పదవులు దక్కాయి. వీరిలో స్టేట్ కో ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా గట్టు తిమ్మప్ప, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా వేద సాయిచంద్ సతీమణి రజని, ముడా చైర్మన్‌గా గంజి వెంకన్న ముదిరాజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మహమ్మద్ ఇంతియాజ్ ఇసాక్, మిషన్ భగీరథ చైర్మన్‌గా ఉప్పల వెంకటేశ్ గుప్తా, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా రమావత్ వాల్యానాయక్, టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్‌గా గోలి శ్రీనివాస్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆంజనేయగౌడ్ పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం వీరి పదవులను రద్దు చేసింది. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్‌లోని ముఖ్య నేతలంతా ఎమ్మెల్సీ లేదా కార్పొరేషన్ చైర్మన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు.

ఎమ్మెల్సీ పదవికి కసిరెడ్డి రాజీనామా..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి 2021లో ఎమ్మెల్సీగా గెలుపొందిన కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి ఖాళీ ఏర్పడింది. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేతలు, పార్టీ టికెట్ ఆశించిన ముఖ్యులకు ఆ పార్టీ ఎమ్మెల్సీ పదవులను ఆఫర్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ లేదా ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం నామినేటెడ్ పదవులపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆశావహుల నుంచి తీవ్రమైన పోటీ నెలకొంది.

భారీగా ఆశావహుల జాబితా..

- ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ఏఐసీసీ కార్యదర్శులుగా కొనసాగుతున్న చిన్నారెడ్డి, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి పార్టీకి సేవలందించారు. వీరిలో వంశీచంద్‌రెడ్డి ఇటీవల ఎన్నికల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే టికెట్‌ను వదులుకొని కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపునకు పని చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం నుంచి ఎంపీగా వంశీచంద్‌రెడ్డి బరిలో ఉంటారన్న ప్రచారం సాగుతోంది. చిన్నారెడ్డితో పాటు సంపత్‌కుమార్ ఎమ్మెల్సీ పదవుల ఆశావహుల్లో ఉన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి సైతం కేబినెట్ స్థాయి పదవిని ఆశిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, ఎన్‌పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్ నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు.
- నారాయణపేట జిల్లాలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధులు నాగరాజుగౌడ్, గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ ఎమ్మెల్సీ పదవులపై ఆశలు పెట్టుకున్నారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో చింతలపల్లి జగదీశ్వరరావు, జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ ఠాకూర్, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, కొండా మణెమ్మ నగేశ్, డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డి ఆశావహుల జాబితాలో ఉన్నారు.

నడిగడ్డలో పదవులకు పోటీ..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు 12 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించగా, నడిగడ్డగా పేరొందిన గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. అయితే ఇక్కడి నుంచి ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులను ఆశిస్తున్న కాంగ్రెస్ ఆశావహుల జాబితా ఎక్కువగా కన్పిస్తోంది. అలంపూర్‌లో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ ఎంపీ మందా జగన్నాథం, తాజా మాజీ ఎమ్మెల్యే అబ్రహం ఎమ్మెల్సీ పదవులతో పాటు కేబినెట్ స్థాయి హోదా పదవిని ఆశిస్తున్నారు. గద్వాలలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మధుసుదన్‌బాబు ఎమ్మెల్సీ లేదా ప్రభుత్వంలో సముచిత స్థానాలు దక్కుతాయని ఆశలు పెట్టుకున్నారు. వీరితో పాటు జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, ఆలయాల చైర్మన్లు తదితర నామినేటెడ్ పోస్టులకు సైతం తీవ్రమైన పోటీ నెలకొంది.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- 13 టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: జిల్లాలో ఇసుక అక్రమ రవాణను సమర్థవంతంగా అరికట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించడానికి శనివారం కలెక్టరేట్‌లోని వీసీ కాన్ఫరెన్స్ హాల్లో అడిషనల్ కలెక్టర్లు మయాంక్ మిత్తల్, అశోక్ కుమార్, ఎస్పీ యోగేష్ గౌతమ్‌లతో కలిసి నిర్వహించిన డీఎల్ఎస్‌సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి పోలీసు, రెవెన్యూ, గనులు, భూగర్భ జలాలశాఖ అధికారులతో 13 టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మన ఇసుక మన వాహనం ద్వారా చాలా సులభంగా ప్రజలు ఇసుకను పొందవచ్చన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న వర్కూరు, మాగనూర్ రీచ్‌లతో పాటు కొత్తగా మక్తల్ మండలంలోని చిట్యాల, అడవి సత్యారం, రీచ్‌లను ఏర్పాటు చేయాలని డీఎల్ఎస్‌సీచైర్మన్ అధ్యక్షతన కమిటీ తీర్మాణం చేసింది.

ఫిల్టర్ ఇసుక ప్రాంతాల గుర్తింపు

అంతకుముందు మైనింగ్‌శాఖ ఏడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టా భూముల్లో ఇసుకను తరలించడానికి డీఎల్ఎస్‌సీ చైర్మన్ అనుమతి తీసుకోవాలన్నారు. ఫిల్టర్ ఇసుక ప్రాంతాలను గుర్తించబడ్డాయని, నీటి వసతి ఎక్కడ ఉంటుందో అక్కడే ఫిల్టర్ ఇసుక తయారు అవుతుందన్నారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ఇసుక రిచ్‌లను ఎప్పటికప్పుడు ఆయా పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పర్యవేక్షించాలని ఆదేశించారు. అయితే ఆన్‌లైన్ ద్వారా తరలిస్తున్న ఇసుకకు సంబంధించిన అనుమతి పత్రాలను తహసీల్దార్లు ఎస్ఐలకు పంపాలని సూచించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేయాలన్నారు.

చనిపోయిన వారి పేర్లను తొలగించాలి

ఓటరు జాబితాలో నుంచి చనిపోయిన వారి పేర్లను తొలగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన తహసీల్దార్, సూపర్ వైజర్, బీఎల్ఓల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం తయారు చేసే ఓటరు జాబితాలో తప్పులు ఉండరాదన్నారు. జిల్లాలో వందేళ్లకు పైబడి వయస్సు కలిగిన ఓటర్లు 900 మంది ఉన్నారని, ఇందులో ఎంత నిజం అనేది సూపర్ వైజర్లు, బీఎల్‌ఓలు, క్షేత్రస్థాయికి వెళ్లి విచారించాలన్నారు. వాస్తవానికి ఆ వయస్సు కలిగిన వారు ఉంటే ఖచ్చితమైన నిర్ధారణ అవసరమన్నారు. వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడికి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 8న ప్రచురించే తుది జాబితాలో ఎలాంటి సమస్యా ఉండరాదన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్ గౌతమ్ కొబ్బరికాయలు కొట్టగా.. అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ ట్రాఫిక్ సిగ్నల్స్ స్విచ్ ఆన్ చేసి సిగ్నల్స్ ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం నూతన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ రూల్స్ పాటించాలని వారు సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వరారవు, సీఐలు రవిబాబు, రాంలాల్, ఎస్ఐలు విజయ్‌కుమార్, పర్వతాలు, విజయ్‌భాస్కర్, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళా సంఘాలకు చెక్కులు అందజేస్తున్న జోనల్ మేనేజర్ శ్రీకాంత్

మరికల్: మహిళా సంఘాలకు అందజేస్తున్న రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని యూకో బ్యాంకు జోనల్ మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. మరికల్‌లో శనివారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణామేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మహిళా సంఘాలకు రూ. 2.20 కోట్ల రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. తీసుకున్న రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్‌లో అభివృద్ధి చెందుతారన్నారు. మహిళలు వృథా ఖర్చులకు పోకుండా డబ్బులను పొదుపు చేసుకోవడం చాలా ముఖ్యమన్నారు. రుణాలు పొందిన వారు డబ్బును ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటే ఫలితం ఎలా ఉంటుందనే అవగాహన వచ్చిన తర్వాతనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. రుణాలతో మహిళల జీవితాల్లో మార్పు వస్తే బాగుంటుందన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రవికుమార్, ఏపీఎం చెన్నప్ప, డిపిఎం రామునాయక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 16 మంది డీబార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ 5, 1 పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 48 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. 5వ సెమిస్టర్‌లో 10,936 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా.. 10,540 మంది హాజరవగా.. 384 మంది గైర్హాజరయ్యారు. రెండు సెమిస్టర్లలో కలిపి మొత్తం 16 మంది విద్యార్థులను స్క్వాడ్ అధికారులు డీబార్ చేశారు. జడ్చర్ల బీఆర్ఆర్ కళాశాలలో 5, అచ్చంపేట ప్రగతి కళాశాలలో 5, అచ్చంపేట చైతన్య కళాశాలలో 3, స్ఫూర్తి, ఎంఏఎల్‌డీ, ఎస్వీఆర్ఎం కళాశాలల్లో ఒక్కొక్కరి చొప్పున డీబార్ అయ్యారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువు సామర్థ్యాలను పెంచేందుకు విద్యాశాఖ అమలు చేస్తున్న జాలీ ఫోనిక్స్, ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి వంటి బోధనాభ్యాస విధానాలను తరగతి గదుల్లో విధిగా అమలు చేస్తూ బోధన చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. ఈ మేరకు శనివారం కోస్గి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో బోధనాభ్యాస విధానం అమలు, సాధించిన ప్రగతిపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో శనివారం ఉదయం 12 మంది జాలీ ఫోనిక్స్ ప్రతినిధులు, 9 మంది డీఆర్పీల బృందంతో కూడిన జిల్లా పరిశీలన బృందాలు పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరిశీలించిన అనంతరం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ.. 1, 2వ తరగతుల విద్యార్థులకు ఆంగ్ల బోధనలో సామర్థ్యాలను పెంచేందుకు అమలు చేస్తున్న జాలీ ఫోనిక్స్ కోస్గి మండలంలో సక్రమంగా అమలు చేస్తున్నారని ఉపాధ్యాయులను అభినందించారు. 1 నుంచి 5వ తరగతి వరకు అమలు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్, 6 నుంచి 10 తరగతి వరకు అమలు చేస్తున్న ఉన్నతి కార్యక్రమాల అమలులో మరింత ప్రగతి సాధించాలన్నారు. పని చేసే వారితోపాటు మొక్కుబడిగా పని చేసే ఉపాధ్యాయుల జాబితా తన దగ్గర ఉందని, ఉపాధ్యాయులందరి సహకారంతోనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. డీఈఓ అబ్దుల్ ఘనీ, ఏఎంఓ విద్యాసాగర్, ఎస్ఓ శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, శంకర్ నాయక్, డీఆర్పీలు వీరు మల్లేష్, నరేందర్ పాల్గొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్- 17 విభాగం బాల, బాలికల బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని, ఐదు జిల్లాల జట్ల క్రీడాకారులు పాఠశాల ఒరిజినల్ బోనోఫైడ్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాల కోసం ఫారుఖ్ ముక్రం (99852 54985), శైలజ (99857 93967)లను సంప్రదించాలని సూచించారు.

రేషన్ కార్డులు వచ్చేనా..?

పదేళ్లుగా పేర్లు నమోదు కాక, కొత్త కార్డులు రాక అవస్థలు

- అన్నిరకాల సంక్షేమ పథకాలకు దూరం
- ఉమ్మడి జిల్లాలో వేలాది దరఖాస్తుల పెండింగ్
- నూతన ప్రభుత్వ ఏర్పాటుతో నిరుపేదల ఆశలు



మహబూబ్‌నగర్ రూరల్/ అచ్చంపేట: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో సామాన్య ప్రజల్లో కొంగొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల పథకాలతోపాటు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. వీటి అమలులో లబ్ధిదారుల ఎంపికకు రేషన్ కార్డులు కీలకం కానున్న నేపథ్యంలో కొత్త కార్డుల జారీ అంశం తెరపైకి వచ్చింది. 2014 నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో ఉమ్మడి కుటుంబాల నుంచి వేరుపడినవారు, కొత్తగా పెళ్లయిన వారు, ఈ పదేళ్లలో జన్మించిన పిల్లల పేర్లు కూడా కార్డుల్లో చేర్చలేదు. కేవలం చనిపోయిన వారి పేర్లు మాత్రమే ఎప్పటిప్పుడు తొలగించారు. గతంలో తెలుపు, గులాబీ రేషన్ కార్డులు ఉండేవి. 2014లో కేంద్ర ప్రభుత్వం గులాబీ కార్డులను పూర్తిగా ఎత్తివేసి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) వారికి ఆహారభద్రత కార్డులు జారీ చేసింది. కేంద్రం జారీ చేసిన రేషన్ కార్డులు పొందలేని వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహారభద్రత కార్డులు ఇచ్చింది. దీంతో కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విధివిధానాలు రూపొందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం రేషన్ కార్డుల్లో అర్హులైన వారిని మాత్రమే కొనసాగించి.. కొత్తగా బీపీఎల్ పరిధిలోకి వచ్చే వారికి కార్డులు జారీ చేస్తారా.. లేకపోతే కొత్తగా అర్హులను గుర్తిస్తారా.. అనేది వేచిచూడాలి.

సంక్షేమ పథకాలు అందక..

కొత్త రేషన్‌కార్డుల మంజూరులో గత ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. కొత్త కార్డులు పొందేందుకు కొందరు, ఉన్న కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం మరికొందరు దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడిచాయి. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయవడంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మళ్లీ మోక్షం కలగలేదు. 2020 కరోనా సమయంలో లాక్‌డౌన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులకు అందజేసిన నిత్యావసర సరకులు, నగదు సాయం సైతం రేషన్‌కార్డులు లేని వందలాది కుటుంబాలకు అందలేదు. లాక్‌డౌన్ తర్వాత 2021 జూలైలో అప్పటి ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసినట్లే చేసి అర్ధంతరంగా నిలిపివేసింది. కనీసం ఎన్నికల ముందైనా రేషన్‌కార్డులు ఇస్తారని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురైంది. ఎన్నికల ముందు తెరపైకి తెచ్చిన గృహలక్ష్మి, బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు తదితర పథకాలకు రేషన్ కార్డులనే ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్తగా పెళ్లయ్యి రేషన్‌కార్డు రాని వారు అనర్హులు కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో భారీగా దరఖాస్తులు...

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 9,34,885 రేషన్ కార్డులు ఉన్నాయి. పాత కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడానికి, కొత్త రేషన్ కార్డుల కోసం పౌరసరఫరాల శాఖకు 20,473 దరఖాస్తులు అందాయి. ఇందులో 17,970 దరఖాస్తులను అర్హులుగా గుర్తించగా.. మిగతా 2,503 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు.

ప్రభుత్వంపై ఆశలు

ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆరు పథకాల అమలుపై పేద ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.2,500 మహాలక్ష్మి పథకంతోపాటు సన్నబియ్యం పంపిణీ, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా పథకాలతోపాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం లభిస్తాయని అనేక కుటుంబాలు కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	దరఖాస్తులు	అర్హులుగా గుర్తించినవి	తిరస్కరించినవి
మహబూబ్‌నగర్	4,391	4,211	180
నాగర్‌కర్నూల్	6,010	5,016	994
గద్వాల	4,297	3,302	995
వనపర్తి	3,465	3,302	163
నారాయణపేట	2,310	2,139	171

ఎదురుచూస్తున్నాం..



నాకు పెళ్లి అయ్యి ఏడేళ్లయ్యింది. అప్పట్లోనే కొత్త కార్డు కావాలని నా భార్య పుట్టింటిలో ఉన్న పేరును తొలగించాం. కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లో ఆప్షన్ కనిపించకపోగా.. చేర్పులకు అవకాశం లేక ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా రేషన్ కార్డు ఇచ్చి ఆదుకోవాలి.
– కురుమూర్తి, కోటకదిర, మహబూబ్‌నగర్ రూరల్ మండలం

అన్ని పథకాలకు దూరం



ప్రభుత్వ పథకాలన్నీ రేషన్ కార్డుతోనే ముడిపడి ఉన్నాయి. నాకు పెళ్లి అయ్యి పదేళ్లు అవుతుంది. ఆరోగ్యశ్రీ పథకానికి, ఉచిత బియ్యం పొందేందుకు దూరమవుతున్నాం. రేషన్ కార్డు ఉంటే మిగతా పథకాల్లో లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. కొత్త ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలి.
– నడిమింటి రత్నమాల, రామచంద్రాపూర్, మహబూబ్‌నగర్ రూరల్

ప్రభుత్వమే నిర్ణయించాలి

కొత్త కార్డుల జారీ, పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. దీనికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. అధికారిక ఉత్తర్వులు రాగానే కొత్త కార్డుల జారీకి చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

కారు, బైక్ ఢీ: యువకుడు దుర్మరణం

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో బైక్‌పై ఉన్న రాకేష్(28) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం . వనపర్తి జిల్లా రేవల్లి మండలం తలుపునూర్ చెందిన రుక్మాకర్‌రెడ్డి దంపతులు కారులో హైదరాబాదు వెళ్తున్నారు. మార్గమధ్యలో వెల్దండ మండలం కొట్రగేట్ వద్ద హైదరాబాదులోని ఆర్టీసీ ఎక్స్‌రోడ్డుకు చెందిన రాకేష్ బైక్‌పై కల్వకుర్తి వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారణాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: ఓ మద్యం దుకాణంలోని పర్మిట్‌రూంలో మద్యం సేవించి అస్వస్థతకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ అశోక్‌బాబు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండేరుకు చెందిన బోయ ఆంజనేయులు (43) శుక్రవారం ఉదయం స్థానికంగా ఉండే ఓ కంపెనీలో హమాలి పనికి వెళ్తానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ఆరా తీయగా ఎలాంటి సమాచారం దొరకలేదు. ఈ క్రమంలో ఎర్రవల్లి చౌరస్తా సమీపంలో ఉండే ఓ మద్యం షాపులోని పర్మిట్ రూంలో ఉదయం నుంచి అతిగా మద్యం తాగి పడిపోయాడు. శనివారం ఉదయం ఎలాంటి స్పృహ లేకుండా పడి ఉన్న అతనిని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులతో పాటు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆయన అప్పటికే మృతి చెంది ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వివాహిత బలవన్మరణం

ఊర్కొండ: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వివాహిత ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన అపర్ణ(24)ను మూడేళ్ల క్రితం మండలంలోని రాంరెడ్డిపల్లికి చెందిన మహేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. అయితే తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న అపర్ణను ఎన్ని ఆస్పత్రులకు చూపించినా తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె శనివారం మధ్యాహ్నం వ్యవసాయ పొలానికి వెళ్లి చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. అనంతరం చుట్టుపక్కల రైతులు గమనించి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని బోరున విలపించారు. ఈ ఘటనపై అపర్ణ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. అపర్ణకు భర్తతోపాటు రెండేళ్ల కూతురు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

గద్వాల క్రైం: కుటుంబ కలహాలు తాళలేక ఉరేసుకుని ఒకరు మృతి చెందిన సంఘటన గద్వాల మండలంలోని పుదూరులో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ ఆనంద్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పుదూరుకు చెందిన నర్సింహులు(34) కొన్ని రోజుల నుంచి ఆర్థికపరమైన సమస్యలు నెలకొన్నాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలోని చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి నడిపి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

రైలు కిందపడి మహిళ..

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ అక్బర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేట పెద్ద శివాలయం సమీపంలో గుర్తు తెలియని మహిళ(34) శనివారం ఉదయం గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అచ్చంపేట రూరల్: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సిద్దాపూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఉప్పునుంతల మండలంలోని దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా.. సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ చౌరస్తాలో పోలీసులు పట్టుకుని తనిఖీ చేశారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వ్యాపారులపై ఎన్నికల దెబ్బ



కార్తీక మాసంలో అలంపూర్ ఆలయాల్లో భక్తుల రద్దీ

కార్తీకమాసంలో ఆలయానికి భక్తుల రాక అంతంతే..

- ఈ మాసంపై జోగుళాంబ ఆలయ సమీప వ్యాపారుల ఎన్నో ఆశలు
- ఎన్నికల వాతావరణంతో కానరాని భక్తుల తాకిడి
- టెంకాయలు, పూలు, పండ్ల వ్యాపారులకు తీరని నష్టం

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠం, శ్రీశైల మహా క్షేత్రానికి పశ్చిమ ద్వార క్షేత్రాలైన అలంపూర్ ఆలయాలు ఈ ఏడాది కార్తీక మాసంలో భక్తులు లేక వెలవెలబోయాయి. ప్రతి ఏటా కార్తీక మాసంలో రోజు భక్తులతో కిటకిటలాడే ఆలయాలు ఈ ఏడాది కనీసం ఆది, సోమవారాలు, ఏకాదశి, పౌర్ణమి వంటి ముఖ్య రోజుల్లో కూడా భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. అలంపూర్ క్షేత్రంలో నెల రోజులపాటు భక్తుల సందడి కనిస్తుందంటే.. అది కేవలం కార్తీకమాసం ఒక్కటి మాత్రమే. శివ రాత్రి సందర్భంగా 5 రోజులు, నవరాత్రులలో 10 రోజులు, వసంత పంచమి ఒక్క రోజు మాత్రమే భక్తుల సందడి ఉంటుంది. అంటే ఆలయానికి ఆదాయం చేకూర్చే మాసం అంటే అది ఒక్క కార్తీక మాసం అనే చెప్పాలి. అయితే ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు రావడంతో భక్తుల తాకిడి పెద్దగా కనిపించలేదు. దీంతో ఆలయాలపై ఆధారపడిన అనేక మంది వ్యాపారులకు తీరని నష్టం వాటిల్లింది. ఎన్నికలతో వ్యాపారుల ఆశలు అడియాసలయ్యాయి. కాగా దేవస్థానానికి మాత్రం గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం అధికంగా చేకూరింది. టికెట్ల ధర పెంపుతో దేవస్థానానికి ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చిందని చెబుతున్నారు.

చివరి నాలుగు రోజులు మాత్రమే..

కార్తీక మాసం ముగింపునకు ముందు శని, ఆదివారం సెలవు దినాలు రావడం, ఆ తర్వాత కార్తీక చివరి సోమవారం, ఆ తర్వాత అమావాస్య రోజుతో కలిపి నాలుగు రోజులు మాత్రమే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం భక్తుల కోలాహలం ఉంటుందని పెట్టుబడులతో వ్యాపారం చేపట్టిన టెంకాయల దుకాణాదారు, పూలు, పండ్ల వ్యాపారం, వాహనాల పార్కింగ్ ఇతర వ్యాపార దుకాణాదారులు ఈ ఏడాది తీవ్ర నష్టాన్ని చవిచూశారు. ఒక రకంగా చెప్పాలంటే రోజువారీ కూలీలను అధికంగా తీసుకుని ఆలయంలో పనులు చేయించిన దేవస్థానంపై కూడా ఈ సారి ఆర్థిక భారం పడింది.

వ్యాపారంలో నష్టం..



ఎప్పటిలాగే కార్తీక మాసంలో భక్తులు అధికంగా వస్తారని ఆశించి పెట్టుబడి పెట్టి మరీ పూజా సామగ్రిని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసి తీసుకొచ్చాం. ఎన్నికల వాతావరణం కారణంగా ఈ సారి కార్తీక మాసం భక్తులు చాలా తక్కువగా వచ్చారు. ఈసారి వ్యాపారాల్లో బాగా నష్టం చూడాల్సి వచ్చింది. – మద్దిలేటి, టెంకాయల వ్యాపారి

గతేడాది కంటే అధికంగా ఆదాయం..



గత ఏడాదితో చూస్తే ఈ ఏడాది ఆదాయం విషయంలో రూ.2,22,696 అధికంగా ఆదాయం వచ్చింది. అయితే ఈ ఏడాది ఆర్జిత సేవా టికెట్ ధరలు పెంచడంతో ఆదాయం కాస్తా ఎక్కువగా వచ్చినట్లు కనిపిస్తుందే తప్ప, భక్తుల రాక సంఖ్యతో పోలిస్తే ఆదాయం కొంత మేరకు తక్కువనే చెప్పాలి. – పురందర్‌కుమార్, ఆలయ ఈఓ

కట్నం ఇవ్వలేదని.. అత్తమామను పొడిచిన అల్లుడు

- అడ్డుకున్న గ్రామస్తులు
- ముగ్గురిని వివాహం చేసుకున్న ఆటో డ్రైవర్
- తల్లి సహకారంతో పారిపోయిన వైనం



నిందితుడు సభావత్ సాగర్

మహమ్మదాబాద్: యువతిని ప్రేమించి మూడో వివాహం చేసుకున్న వ్యక్తి తనకు కట్నం కావాలంటూ అత్తమామను ఇంటికి పిలిపించి కత్తితో పొడిచిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగంపేట్‌తండాకు చెందిన సభావత్ సాగర్ హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో వనపర్తి జిల్లా ఖిల్లాఘణపూర్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఆమె గర్భిణిగా ఉన్న సమయంలో ఆస్పత్రిలో చేర్పించకపోవడంతో ఆమె మృతి చెందింది. కొన్ని రోజుల తర్వాత ఖిల్లాఘణపూర్ పక్కనే ఉన్న మరో తండాకు చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఈమె గర్భిణిగా ఉన్న సమయంలో గండేడ్ మండలం పంచలింగాల్‌తండాకు చెందిన మోహన్, మంగమ్మల కూతురు మాయను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. సంవత్సర కాలంగా వీరిద్దరూ ఇంటికి రాకుండా బయటనే ఉన్నారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు తండాకు రావాలని తెలపడంతో మాయ, సాగర్ శనివారం మంగంపేట్‌తండాకు వచ్చారు. తనకు రూ.2లక్షలు కావాలని ఇస్తే ఆటో నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటానని తెలిపాడు. ఈ విషయం మాట్లాడటానికి అత్తమామలను, రెండో భార్యను కూడా పిలిపించాడు. డబ్బులు ఇవ్వడానికి అత్తమామలు ఒప్పుకుని ఫోన్లో బంధువులతో ఈ విషయమై మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో కోపోద్రిక్తుడైన అల్లుడు సాగర్ అప్పటికే తెచ్చుకున్న కత్తులను తీసి అత్తమామలను పొడిచాడు. వారు అరవడంతో చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని అతన్ని వారించారు. కత్తిపోట్లతో గాయాలపాలై ఉన్న వారిని వాహనంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. కాగా నిందితుడిని ఆయన తల్లి సహకరించడంతో అక్కడి నుంచి పారిపోయినట్టు గ్రామస్తులు తెలిపారు.



పొడిచేందుకు వెంట తెచ్చుకున్న కత్తులు

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు





న్యాయమూర్తులు ఇతర ప్రముఖులకు స్వాగతం పలుకుతున్న ఆలయ ఈఓ, అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జిల్లా జడ్జి కుష, సీనియర్ సివిల్‌జడ్జి గంట కవిత, జూనియర్ సివిల్‌జడ్జి కమలాపురం కవిత, సెంట్రల్ ఇంటెలిజెన్సీ డీఐజీ టి.సంబంధన్, అడిషనల్ ఎస్పీ రవి వేర్వేరు సమయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ముందుగా వీరికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, అర్చకులు ఆనంద్‌శర్మ, వనం శ్రీకాంత్‌శర్మ స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ఏకవార రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. వీరితో పాటు సీఐ రాజు, ఎస్‌ఐ రమేష్ ఉన్నారు. అదేవిధంగా శాస్త్రవేత్త నవనీత ఆధ్వర్యంలో 9మంది మహిళా శాస్త్రవేత్తల బృందం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

విదేశీవిద్యను అందిపుచ్చుకోవాలి



వనపర్తిటౌన్: తెలుగు యువత అమెరికాలో విద్య అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన మార్గనిర్దేశం చేస్తామని అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) అధ్యక్షుడు జయంత్ తెలిపారు. అమెరికాలో విద్యావకాశాలు, మెరుగైన యూనివర్సిటీలు, స్కాలర్‌షిప్ అందించే వివరాలు తెలుసుకునేందుకు ఆటా మెయిల్ ఐడీని సంప్రదించాలని సూచించారు. శనివారం జిల్లాకేంద్రంలో డబ్ల్యూసీసీఎం డిగ్రీ కళాశాల, ఆటా సంయుక్తంగా నిర్వహించిన ఎడ్యుకేషన్ సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విదేశాల్లో తెలుగువారు ఎందరో ప్రతిభ చాటి ప్రపంచానికే దేశం సత్తా చాటారని.. అందులో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెండ్ల ఉన్నారని గుర్తు చేశారు. కొత్త ఆలోచనలు అలవర్చుకొని విద్య, అక్షరాస్యత, వ్యాపార అభివృద్ధిలో తెలుగు ప్రజలు ఎక్కడికి వెళ్లినా అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతోనే ఆటా కొన్నేళ్లుగా విస్తృత పర్యటనలు చేస్తూ అమెరికా అంటే నెలకొన్న భయాందోళనను తొలగిస్తుందన్నారు. యువత ప్రపంచ దేశాల్లో రాణిస్తూనే దేశానికి తోడ్పాటునందించాలని కోరారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సామగ్రిని ఆటా అందిస్తుందని తెలిపారు. అనంతరం అమెరికాలో విద్యా విధానం, మెరుగైన యూనివర్సిటీలు, అక్కడ లభించే ఉపాధి అవకాశాలు తదితర వాటి గురించి ప్రాజెక్టర్‌పై విద్యార్థులకు వివరించారు. ఆటా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సతీష్‌రెడ్డి, కోశాధికారి వేణుగోపాల్, డీఐఈఓ జాకీర్ హుస్సేన్, అధ్యాపకులు వినోద్‌కుమార్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సైదులు, శ్రీధర్, జోత్స్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభచాటాలి



చెస్ క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి విజేతలుగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అండర్– 14, 17 చెస్ ఎంపికలు నిర్వహించారు. ఎంపికల్లో డీవైఎస్‌ఓ పాల్గొని మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పట్టుదలతో ఆడి విజయం సాధించాలని కోరారు. క్రీడల్లో నిరంతరం సాధన చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడుతూ చెస్ ఎంపికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 120 మంది బాల, బాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి వేణుగోపాల్, చెస్ కోచ్ ఆనంద్‌బాబు, శ్రీనివాస్, సత్యనారాయణ, బాలరాజు, సునీల్, జగన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అండర్–17 బాలురు

కుశ్యంత్‌కుమార్ (నాగర్‌కర్నూల్), అతీఫ్, జశ్వంత్, శ్రీనిధ (మహబూబ్‌నగర్), సాకేత్ (నారాయణపేట), బాలికలలో.. పల్లవి, నందిని (మహబూబ్‌నగర్), ఏంజల్ (వనపర్తి), వైష్ణవి, పూజిత (నాగర్‌కర్నూల్) ఎంపికయ్యారు. అలాగే అండర్–14 బాలురలో హన్వేష్‌రెడ్డి, తేజ (మహబూబ్‌నగర్), చేతన్‌సాగర్ (వనపర్తి), హేమచరణ్, కార్తీక్ (నాగర్‌కర్నూల్), బాలికలలో వైష్ణవి, నాగేశ్వరి, గ్రీష్మిక (మహబూబ్‌నగర్), మోక్ష, గీతాదుర్గ (వనపర్తి) ఉన్నారు.

కోయిల్‌సాగర్‌లో 31.6 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో శనివారం సాయంత్రం వరకు 31.6 అడుగులకు నీటిమట్టం చేరింది. ఇటీవల పూర్తి స్థాయిలో 32.6 అడుగుల నీటిమట్టం ఉండగా.. తాగునీటి అవసరాల కోసం నీటిని వినియోగించడం వల్ల ఒక అడగు నీటి మట్టం తగ్గింది. యాసంగి పంటలకు నీటిని వదలడానికి ఏటబీ సమావేశం ఆదివారం జరిగే అవకాశం ఉంది. నీటి విడుదలకు సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశమై నిర్ణయం తీసుకుంటారు.

అనుమానాస్పదంగా గొర్రెలు మృతి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని కుడికిల్లలో గుడిపల్లి చంద్రయ్యకు చెందిన గొర్రెలు 26 అనుమానాస్పదంగా మృతిచెందాయి. కాపరి చంద్రయ్య తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గొర్రెలను గ్రామ సమీపంలోని కేఎల్‌ఐ ప్రధాన కాల్వ వద్ద మందను ఆపుకొంటూ ప్రతిరోజు లానే శనివారం కూడా మేతకు తీసుకెళ్లాడు. అంతలోనే మందలోని 26 గొర్రెలు అస్వస్థకు గురయ్యాయి. అంతలోనే హటాత్తుగా అక్కడికక్కడే 26 గొర్రెలు మృతిచెందాయి. మిగతా గొర్రెలు కూడా అస్వస్థకు గురయ్యాయి. వెంటనే వైద్యులను సంప్రదించారు. వైద్యులు రిపోర్టును ల్యాబ్‌కు పంపించారు. గొర్రెలు మృతిచెందడంతో గుడిపల్లి చంద్రయ్యకు దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ ప్రజా ప్రతినిధులు కోరారు.



కుడికిల్ల గ్రామ సమీపంలో మృతిచెందిన గొర్రెలు

తారస్థాయికి పంచాయితీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్లు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి బయటకు వచ్చిన పందుల పెంపకందారు బాలస్వామి తదితరులు

- జడ్చర్లలో ముదిరిన పందుల తరలింపు వివాదం
- చేతుల మారిన రూ.లక్షలు?
- మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తపై పోలీసులకు ఫిర్యాదు
- తమకు సంబంధం లేదంటున్న చైర్‌పర్సన్
- సమగ్ర విచారణకు కాంగ్రెస్ సభ్యుల డిమాండ్

జడ్చర్ల: స్థానిక పుర పాలకవర్గం, పందుల పెంపకందారుల మధ్య చోటు చేసుకున్న పంచాయతీ రోజురోజుకు తీవ్రమై ఏకంగా పోలీస్‌స్టేషన్‌కు చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త రవీందర్‌పై ఆరోపణలు రావడంతో శనివారం పుర కార్యాలయంలో చైర్‌పర్సన్ లక్ష్మి పాలకమండలి సభ్యులతో కలిసి హడావుడిగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి పందులను పట్టణానికి దూరంగా తరలించడంలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోలేదని వివరణ ఇచ్చారు. ఇదే సమయంలో పందుల పెంపకందారు ఎరుకలి బాలస్వామి తోటివారితో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త రవీందర్‌పై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. పందులను తరలించకుండా ఉండేందుకు తనను చైర్‌పర్సన్ భర్త రవీందర్ రూ.10 లక్షలు డిమాండ్ చేయగా.. బతిమిలాడి చివరకు రూ.4 లక్షలు ఇచ్చానని, ఆ వెంటనే ఓ హత్య కేసులో జైలుకు వెళ్లగా ఇదే అదనుగా భావించి మున్సిపల్ కమిషనర్ పోలీసులతో కలిసి పందులను డీసీఎంలలో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారని వివరించారు.

ఇదీ కథ..

పట్టణంలో పందుల సంచారం పెరగడంతో అపరిశుభ్రత నెలకొని రోగాల బారిన పడుతున్నామని.. చిన్నారులపై సైతం దాడి చేస్తున్నాయని, ఊరికి దూరంగా తరలించాలని పట్టణవాసులు పలుమార్లు అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పుర పాలకమండలి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన పందుల పెంపకందారులతో సమావేశమై ఊరికి దూరంగా తరలించాలని కోరారు. తమకు రెండు ఎకరాల భూమి కేటాయిస్తే తరలిస్తామని పెంపకందారులు విన్నవించారు. ఎటూ తేలకపోవడంతో పుర అధికారులు రెండు, మూడు పర్యాయాలు పందులను పట్టుకొని బయటి ప్రాంతాలకు తరలించడం ప్రారంభించారు. మూడు నెలల కిందట ఓరోజు రాత్రి పోలీసు బందోబస్తు నడుమ పెద్దమొత్తంలో పందులను పట్టి బయటకు తరలించారు. పందులను అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారని పాలక మండలి సభ్యులే ఆరోపణలు చేయడంతో పాటు కొందరు సభ్యులు అప్పట్లోనే లక్ష్మారెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. తదుపరి చర్చ లేకపోవడంతో అంతా గమ్మునున్నారు.

విచారణకు సిద్ధం..

తమపై వచ్చిన అవినీతి, అక్రమాలపై విచారణకు సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మితో పాటు వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు ప్రశాంత్ రెడ్డి, నందకిషోర్‌గౌడ్, దేవ, జ్యోతి, లత, చైతన్య, రఘు, మహేశ్ తెలిపారు. కాగా పందుల తరలింపులో అక్రమాలు చోటు చేసుకున్నాయని.. సమగ్ర విచారణ జరిపితే నిజానిజాలు బయటకు వస్తాయని కాంగ్రెస్ కౌన్సిలర్ రాజు డిమాండ్ చేశారు.

ఇలా తెరపైకి..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మొదటిసారి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుర పాలకమండలి అవినీతిపై మాట్లాడారు. పందుల తరలింపునకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించాలని మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. పందులు ఎక్కడకు తరలించారు.. ఎంతకు విక్రయించారు.. వచ్చిన డబ్బును ఏం చేశారు వంటి ప్రశ్నలు సంధించారు. దీంతో పాలక మండలి సభ్యులు తమపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టేందుకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో పందుల పెంపకందారు బాలస్వామి చైర్‌పర్సన్ లక్ష్మి భర్త రవీందర్‌పై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికార, విపక్ష పార్టీల మధ్య మొదలైన ఈ పంచాయితీ ఎంత దూరం వెళ్తుందో వేచి చూడాలి.

నారాయణపూర్‌లో 11 ఇళ్లలో చోరీ



నారాయణపూర్‌లో ధ్వంసమైన బీరువా

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో గ్రామాన్ని సందర్శించి చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. గ్రామానికి చెందిన ఆర్.అచ్చాలి ఇంట్లో తులంన్నర బంగారం, రూ.40వేల నగదు, ఎన్. గోపాల్ ఇంట్లో అర తులం బంగారుతో పాటు రూ.10వేల నగదు, జగిరి ఇంట్లో క్వింటాల్ బియ్యం, రూ.7వేల నగదు, ఎం.తారాసింగ్ ఇంట్లో రూ.5వేల నగదు, డేరంగుల మల్లేష్ ఇంట్లో అర తులం బంగారు, రూ.10వేల నగదు, సిరమోని అంజమ్మ ఇంట్లో రూ.7వేల నగదు, నారమ్మ ఇంట్లో రూ.10వేల నగదు, రాములు ఇంట్లో 30తులాల వెండి గొలుసులు, శంకర్, బాలస్వామి ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈనెల 13న తిమ్మినోనిపల్లిలో 7ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఏకంగా 11ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ విషయం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పెబ్బేరులో బైక్..

పెబ్బేరు రూరల్: పట్టణంలోని న్యూ రఘు వైన్స్ వద్ద ఓ బైక్ చోరీ అయ్యింది. ఎస్‌ఐ జగదీశ్వర్ వివరాల మేరకు.. పెబ్బేరు పట్టణానికి చెందిన భీష్మాచారి శనివారం న్యూ రఘు వైన్స్ ఎదుట బైక్ నిలిపారు. వ్యక్తిగత పనిమీద బయటికి వెళ్లి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. వెంటనే అతడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండో వివాహంతో మోసం

- యువతి కుటుంబ సభ్యులపై కేసు నమోదు

మహమ్మదాబాద్: మొదటి వివాహమంటూ ఓ వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుని మోసం చేసిన యువతి, ఆమె కుటుంబీకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సురేష్ వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలంలోని జూలపల్లి తండాకు చెందిన ప్రశాంత్‌కు గతనెల 29న మహబూబ్‌నగర్‌కు చెందిన కొర్ర స్రవంతితో వివాహమైంది. అయితే అంతకు ముందే సదరు యువతికి మరో వ్యక్తితో వివాహం జరిగింది. మొదటి భర్తపై కేసు కూడా నమోదయ్యిందని.. ఆ విషయం చెప్పకుండా ప్రశాంత్‌ను రెండవ వివాహం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కొర్ర స్రవంతి, ఆమె కుటుంబీకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

LAND FOR SALE
■ MVR రియాల్టీ గ్రూప్ మహబూబ్‌నగర్‌లో మన్యంకొండకు అనుకొని బెంగుళూరు రోడ్డుకు దగ్గరలో సెవెన్ హిల్స్ శాండల్ వుడ్ పామ్ ల్యాండ్ అమ్మబడును. సంప్ర॥. సెల్: 9391745197, 9391271159.

NEW FLAT FOR SALE OR RENT
■ జడ్చర్ల పట్టణంలోని బద్రి నారాయణ హైట్‌లోని మోడ్రన్ ఫర్నిచర్‌తో కలిగిన కొత్త 2 బెడ్ రూమ్ ఫ్లాట్ నెంబర్ 405 అమ్మడానికి లేదా కిరాయి ఇవ్వబడును. కావలసిన వాళ్ళు ఈ క్రింది ఫోన్ నెంబర్‌ను సంప్ర॥ సెల్: 8885273535, 8555885708.

SERVICES

BUSINESS OFFER
■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9810515824, 8800486710

HEALTH CARE

ORTHOPEDIC SURGEON
■ డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో ఫార్మసీ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228666, 83412 98666

GENERAL & LAPROSCOPIC SURGEON
■ కార్తీక్ హాస్పిటల్, సంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, స్త్రీ వ్యాధులు, జనరల్, బీ.పి. షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స, EHS సౌకర్యం కలదు. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్, డా॥పార్వతీదేవి, M.D.DGO., స్త్రీ వ్యాధి, ల్యాప్రోస్కోపి నిపుణులు. టైమింగ్స్:10-8PM, 08518-226162

భవిత విద్యార్థుల కోసం

WANTED
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9849933042.

■ హరేకృష్ణహోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18k. ఫోన్: 9640258899 / 9640468899.

■ రామకృష్ణ గ్రూప్ (T.S.No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/ పేషెంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం 15-21వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికే పంపగలము. Ph: 9515119570/ 9515108830

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీకేర్‌టేకర్స్, లేడీనర్సులు, కాంపౌండర్స్, ఆయాలు భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9891036931, 9246585901.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు – సాక్షి మేనేజర్